## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే బీసీల మద్దతు



వైఎస్సార్‌సీపీకి మద్దతుగా బీసీ నాయకుల సంఘీభావం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అభివృద్ధి రధసారథి, పేదవర్గాల జీవన ప్రమాణాలు పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్న శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి పేరాడ తిలక్‌ల విజయానికి కృషి చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరం ప్రెస్‌క్లబ్‌లో శిష్టకరణ, సొండి, శ్రీశయన, అరవల, పట్టుశాలి కులాల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులాల అభ్యున్నతికి వైఎస్సార్ కృషిచేయగా, ఆయన బాటలోనే సీఎం జగన్ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని చెప్పారు. సమావేశంలో డబ్బీరు శ్రీనివాసరావు, డాక్టర్ బగ్గాం శ్రీనివాస్ పట్నాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### ఓటే వజ్రాయుధం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

జి.సిగడాం: ప్రజాస్వామ్యం ఓటే వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ జి.సిగడాం మండల కేంద్రంలో శనివారం ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ఆవశ్యకత వివరిస్తూ మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకన్నబాబు, మండల అధికారులు అరసాడ రవి, మహదాస్యుల రమేష్, రెడ్డి రామకృష్ణంనాయుడు, తులసీప్రసాద్ సాహు, భూపతి నర్సింగరావు, చోళ్ల సత్యనారాయణ, పాగిరి రాము, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న అన్నమయ్య స్వరార్చన

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ఆరోహి సంగీత కళాశాలలో శనివారం నిర్వహించిన అన్నమాచార్య స్వరార్చన ఆకట్టుకుంది. పెంకి నాగేశ్వరరావు సంగీత సారథ్యంలో పలు అన్నమయ్య కీర్తనలను భాస్కరరావు, సిమ్మన్న, వాణిప్రియ, ఈశ్వరరావు, ఇందు, అను, ప్రేమ్, సుధాన్వ, నాయాణిజ, ఆర్యమిత్ర, మోహిత్‌లు చక్కగా ఆలపించారు.

# సంక్షేమమా.. సంక్షోభమా..!

- వైఎస్సార్ సీపీతోనే పథకాల కొనసాగింపు
- చంద్రబాబుకు ఓటేస్తే మోసపోయినట్టే
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్:

ఎన్నికల సమయంలో ఇచ్చి హామీలను నెరవేర్చిన ప్రభుత్వం ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని మంత్రి, శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శనివారం రూరల్ మండల పరిధిలోని లంకాం, వాకలవలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా



శ్రీకాకుళం రైతుబజారు జంక్షన్ వద్ద ధర్మాన ర్యాలీ

ఆయన మాట్లాడుతూ విపక్షనేత చంద్రబాబు పెత్తందారులకు కొమ్ముకాస్తూ పేదల కక్షపూరితంగా ఉంటారని మండిపడ్డారు. వైఎస్సార్ చేయూత డబ్బులు లబ్ధిదారుల అకౌంట్లలో జమ కాకుండా ఫిర్యాదులు చేసి ఆపించారని దుయ్యట్టారు. వలంటీర్ల సేవలను సైతం అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. రెండు నెలలుగా దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం పాట్లు పడ్డారని గుర్తు చేశారు. పొరపాటున చంద్రబాబుకు అధికారం కట్టబెడితే పథకాల అమలుకు గ్యారెంటీ లేదన్నారు. సంక్షేమ ప్రభుత్వానికే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



ప్రజలతో కలిసి ప్రచారం చేస్తున్న ధర్మాన

## కూటమి కార్యకర్తల కవ్వింపు చర్యలు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో కూటమి కార్యకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో సీఐ రామచంద్రరావు, ఎస్సై కె.గోవిందరావులు ఇరువర్గాలను చెదరగొట్టారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహిస్తూ రోడ్డుకు మరో వైపు ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు స్పందించి పరిస్థితిని సద్దుమణిగించారు.



కూటమి కార్యకర్తలను చెదరగొడుతున్న సీఐ రామచంద్రరావు

## నర్సుల సేవలు అభినందనీయం

శ్రీకాకుళం: ఆస్పత్రికి వచ్చే రోగులను ప్రేమ పూర్వకంగా సేవలందించాలని, అప్పుడే సగం రోగం నయమవుతుందని రిటైర్డు నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రమీలామోహన్ అన్నారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో శనివారం నర్సు డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సుల సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ హెడ్ నర్సులు ఎస్.వి.లక్ష్మి, శాంతికుమారి, రాంబాయి, సూపరింటెండెంట్ రమణమ్మ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రమీలా మోహన్

## ఆమె నేత్రాలు సజీవం



రమణమ్మ(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కొత్తరోడ్డులో నివాసముంటున్న దాస్యం రమణమ్మ(81) మృతి చెందడంతో కుటుంబ సభ్యులు దాస్యం రవి, దూబ సత్యనారాయణల అంగీకారంతో ఆమె నేత్రాలను శనివారం దానం చేశారు. మరణానంతరం కూడా మరో ఇద్దరికి చూపు నివ్వాలనే ఆలోచనలతో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు సమాచారం అందజేశారు. దీంతో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా చనిపోతే నేత్రదానం చేయాలనుకుంటే 7842699321 నంబరుకు సంప్రదించవచ్చని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో నేత్ర సేకరణ టెక్నీషియన్ సుజాత, నంది ఉమాశంకర్, దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సంక్షేమ పాలనకు పట్టంకట్టండి



రణస్థలం: కొవ్వాడ ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- కూటమి మేనిఫెస్టోను నమ్మవద్దు
- ఎన్నికల ప్రచారంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం కొవ్వాడ, జీరుపాలెం, జె.ఆర్.పురం పంచాయతీల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఇంటింటికి వలంటీర్లు వచ్చి పింఛన్లు ఇచ్చేవారని, చంద్రబాబు కూటమి ఫిర్యాదు వల్ల ఆ పరిస్థితి లేదన్నారు, పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థ రద్దు చేస్తారని, అవ్వాతాతలు పింఛన్ కోసం మండుటెండల్లో పడిగాపులు కాసే రోజులు మరలా వస్తాయని చెప్పారు.వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్న చంద్రబాబుకు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, పిన్నింటి సత్యంనాయుడు, దన్నాన సీతారాం, రాముడు, అల్లిపల్లి అప్పన్న, పట్టయ్య, జగ్గులు పాల్గొన్నారు.



రణస్థలం: జీరుపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలసలో వైఎస్సార్ సీపీ నాయకుల ర్యాలీ



ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో ఎన్నికల ప్రచారం



జి.సిగడాం: పెంట గ్రామంలో ప్రచారం చేస్తున్న సోనియా, శ్రీలత, ధనలక్ష్మి



రణస్థలం: పాతర్లపల్లిలో మాట్లాడుతున్న గొర్లె పరిమళ, పిన్నింటి రజని



జి.సిగడాం: ఎస్‌పీఆర్‌పురం మహిళా కన్వీనర్ కంది రమాదేవి ఆధ్వర్యంలో ప్రచారం



జి.సిగడాం: గెడ్డకంచరాం కాలనీలో ప్రచారం చేస్తున్న మహిళా కార్యదర్శి నక్క హేమలత

సంతబొమ్మాళి మండలం జగన్నాథపురంలో శ్రీనివాసరావు కబ్జా చేసిన భూమిలో రొయ్యల చెరువు వేసిన దృశ్యం



# పచ్చ మంద భూముల దందా

- అధికారంలో ఉండగా అచ్చెన్న ఆగడాలు
- టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, మెళియాపుట్టి, కోటబొమ్మాళిలో బయటపడిన భూ అక్రమాలు
- రికార్డులు తారుమారు చేసి భూములు కొట్టేసిన వైనం



కోటబొమ్మాళిలో పెద్ద చెరువులో సర్వే నంబరు 91లో పెద్ద చెరువు గట్టును చదును చేసి, చెరువు గర్భంలో రోడ్డేసి సుమారు 12 ఎకరాల స్థలాన్ని కబ్జా చేసిన దృశ్యం

టీడీపీ అధికారంలో ఉన్న కాలంలో కింజరాపు అచ్చెన్నాయుడు అనుచరులు, కుటుంబీకులు చేసిన భూదందాలు అన్నీ ఇన్నీ కావు. ఎక్కడికక్కడ తప్పుడు రికార్డులు సృష్టించి భూ అక్రమాలకు పాల్పడ్డారు. అవి ఒక్కొక్కటిగా వెలుగు చూస్తూనే ఉన్నాయి. అధికారంలో ఉండగా తమకు తెలిసిన వ్యక్తుల పేరు మీద ఉన్న భూముల వివరాలను మార్చేసి మాల్ ప్రాక్టీసుకు పాల్పడ్డారు. దానికి అప్పట్లో కొందరు రెవెన్యూ అధికారులు సహకరించారు. అధికారుల స్టాంపు, డిజిటల్ సిగ్నేచర్‌ను తమ గుప్పెట్లో పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారు. అప్పట్లో ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారికి బెదిరింపులు, చిత్ర హింసలకు గురి చేసేవారు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

రికార్డులు తారుమారు చేయడం, ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేయడం, అడిగిన వారిని బెదిరించడం.. అచ్చెన్నాయుడు ఆగడాలకు అంతూపొంతూ లేదు. అధికారంలో ఉండగా ఆయన అక్రమాలు అడ్డు లేకుండా సాగాయి. ఆయన అనుచరులు కూడా కబ్జా కాండను కొనసాగించిన దాఖలాలు ఉన్నాయి.

- టెక్కలి మండలం అయోధ్యపురం పంచాయతీలో అచ్చెన్నాయుడు అనుచరుడు రమణ లచ్చన్నపేట సమీపంలో సర్వే నంబరు 135 లో ఉన్న మెట్టను ఆక్రమించుకుని క్రషర్ నిర్వహిస్తున్నారు. సుమారు 2 ఎకరాల్లో తన సోదరుడి పేరుతో డి పట్టాలు సృష్టించుకుని మెట్టను ఆక్రమించుకుని దర్జాగా స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్నారు. గతంలో ఇదే పంచాయతీకి చెందిన కంట్రగడ గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదు.
- టెక్కలి మండలం బలరాంపురం గ్రామంలో అచ్చెన్నాయుడు అనుచరులు తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి కమిటీ సభ్యులైన పాపారావు, సూర్యనారాయణ అనే వ్యక్తులు సమీపంలో సర్వే నంబరు 495 లో టెక్కలి–తెంబూరు రోడ్డుకు ఆనుకుని ఉన్న మెట్టను ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు చేసేశారు.
- నందిగాం మండలంలోని శివరాంపురం పంచాయతీ బడబంద రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 149 లో 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మెట్టను అప్పట్లో టీడీపీ నాయకులు ప్రసాదరావు, బాలకృష్ణ తదితర అప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులు, వారి బంధువుల పేరుతో పట్టాలు తయారు చేసుకున్నారు. ప్రసాదరావు తన పేరున మూడున్నర ఎకరాలకు ఖాతా నంబరు 309లో వారసత్వ భూమిగా రాయించుకోగా, ఆయన చెల్లి పేర ఖాతా నంబరు 208లో 4 ఎకరాలు, టీడీపీ నాయకుడు ప్రసాదరావు అనుయాయుడు అయిన పెంటూరుకు చెందిన బాలకృష్ణ పేర ఖాతా నంబరు 312లో ఒక ఎకరాకు, జి.ఆదిలక్ష్మి పేర ఒక ఎకరాకు పట్టాలు పుట్టించారు. అలాగే నందిగాంకు చెందిన చలపతిరావు కుమారుడు వైకుంఠరావు 310 ఖాతా నంబరుతో మూడు ఎకరాలు రాయించుకున్నారు. వీరంతా అచ్చెన్నాయుడు అనుచరులే.

## టెక్కలి నియోజకవర్గంలో జరిగిన మరికొన్ని భూదందాలు

- టెక్కలి నియోజకవర్గ పరిధిలోని గొల్లూరు పంచాయతీ సొంఠినూరు పరిధిలో సర్వే నంబరు 1–1లో ఉన్న కొండపై టీడీపీ మండల నాయకుడు తన బినామీల పేరున అనేక పట్టాలు సృష్టించుకున్నాడు. అలాగే టీడీపీ కార్యకర్త మదన్ అనే వ్యక్తి ఆనందపురం సమీపంలో భూములు లేని వారి పేర్లతో పత్రాలు సృష్టించి ఆయా భూములను అమ్మకాలు చేసేందుకు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డాడు.
- గత టీడీపీ హయాంలో కోటబొమ్మాళి మండల కేంద్రంలో పెద్ద చెరువు అభివృద్ధి పేరుతో సుమారు 12 ఎకరాలను కబ్జా చేసుకున్నారు. సర్వే నంబరు 91లో సుమారు 28 ఎకరాల ఆయకట్టు విస్తీర్ణంగల పెద్ద చెరువు గట్టును చదును చేసి దాని గర్భంలో సుమారు 12 ఎకరాల స్థలాన్ని 20 మంది వరకు ఆక్రమించారు. ఇందులో ప్రధానంగా టీడీపీ నాయకుడు రమేష్‌తో పాటు కీలకమైన కార్యకర్తలు ద్వారకా, కృష్ణారావు రాముడుతో పాటు మొత్తం 20 మంది టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.
- కోటబొమ్మాళి మండలంలో గల గరీబుల గెడ్డ పరివాహక భాగంలో నీలంపేట–కిష్టుపురంల మధ్య సుమారు 7 ఎకరాలు అప్పట్లో టీడీపీ నాయకుడు చిన్నవాడు కబ్జా చేసుకున్నాడు.
- కోటబొమ్మాళి మండలంలోని దంత–సరియాపల్లి గ్రామాల మధ్య గరీబులుగెడ్డ ఎగువభాగాన్ని దంత గ్రామాలకు చెందిన మోహనరావు, కామేశ్వరరావు కనుసన్నల్లో వారి అనుచరులు గెడ్డను కబ్జా చేశారు.
- కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో గొండు లక్ష్మణరావు నేతృత్వంలో కొంత మంది టీడీపీ కార్యకర్తలు సుమారు 30 ఎకరాలు చిన్న ఎర్రబంద యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడ్డారు. యలమంచిలి పంచాయతీలో టీడీపీ నాయకుడు లీలామోహన్ నేతృత్వంలో టీడీపీ కార్యకర్తలు బంద చెరువు కబ్జా చేశారు. వీరంతా అచ్చెన్నాయుడు అనుచరులే.
- సంతబొమ్మాళి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు సర్వే నంబరు 315 లో సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుని రొయ్యల చెరువులకు లీజుకు ఇచ్చారు. అప్పట్లో మంత్రి అచ్చెన్నాయుడు అండతో లక్షలాది రూపాయల విలువైన భూములను ఆక్రమించుకోవడంతో అధికారులు ఏం చేయలేకపోయారు. అయితే దీనిపై కొంత మంది వ్యక్తులు హైకోర్టులో పిల్ వేసినప్పటికీ భూ కబ్జాకు అడ్డుకట్ట వేయలేకపోయారు.
- కింజరాపు అచ్చెన్నాయుడు అనుచరుడు మదన్ నందిగాం మండలం మాదిగాపురం పరిధిలో చిన్నమ్మలు, సత్యవతిల పేరున సుమారు 14 ఎకరాలను, సొంఠినూరు పరధిలో చిన్నమ్మలు పేరున 15 ఎకరాలు, సత్యవతి పేరున 15 ఎకరాలు, త్రినాథరావు పేరున 15 ఎకరాలకు రెవెన్యూ రికార్డులను తయారు చేయించి వారి పేరున 1బీలు, అడంగల్ కాపీలు తయారు చేశారు. వీటిని హైదరాబాద్‌కు చెందిన కరుణాకర్‌కు అమ్మకం పెట్టేశారు. అప్పట్లో కొనుగోలు దారులు బయటికి రావడంతో వ్యవహారం వెలుగు చూసింది.
- అచ్చెన్నాయుడు మరో అనుచరుడు, మెళియాపుట్టి మండలానికి చెందిన టీడీపీ నేత చంద్రశేఖర్ కరజాడ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 373–41, 373–42, 373–43లో ఉన్న 3.62 ఎకరాల ప్రభుత్వ భూమిని తన భార్య హేమలత పేరుతో పట్టా చేయించుకున్నారు. అంచెలంచెలుగా రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదు చేయించుకుని కంప్యూటర్ అడంగల్ పొందాడు. వాస్తవానికి ప్రభుత్వ భూమి పొందితే డి పట్టా అని రాయించాలి. తననెవరు గమనిస్తారనుకున్నారేమో గాని అనువంశికం అని రికార్డుల్లో నోట్ చేయించాడు. ఆ పట్టాలను చూపించి గొప్పిలి సిండికేట్ బ్యాంకులో రూ. 75,655 రుణం తీసుకున్నాడు. అలాగే, చంద్రశేఖర్ తన పేరున 239/3, 240/2, 204/4, 251/5, 189/పీ, 263/1 సర్వే నంబర్లతో 4.29ఎకరాల మేర పట్టాలు సృష్టించారు. వాటిని చూపించి రెండు ధఫాలుగా రూ. 82,907, రూ. 98, 230 మేర రుణాలు తీసుకున్నాడు. ఈయన, ఈయన భార్య పైనే కాకుండా పలాస మండలం గోపివల్లబాపురం గ్రామంలో తన బంధువుల పేరిట 8.38ఎకరాల ప్రభుత్వ భూమిని పొందాడు.
- కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాలెంలో అచ్చెన్నాయుడుకు బంధువు, ప్రధాన అనుచరుడు అచ్చెన్నాయుడు వితంతు దళిత మహిళ చిట్ట నీలమ్మకు చెందిన స్థలాన్ని కబ్జా చేసిన వ్యవహారం కూడా బయటకు వచ్చింది. తనకు చెందిన 22 సెంట్లు స్థలానికి సంబంధించిన భూరికార్డులను తారుమారు చేసి ఆక్రమించుకున్నారని ఏకంగా ఫిర్యాదు చేశారు.
- కోటబొమ్మాళి మండలం నిమ్మాడ సమీప తులసీపేట గ్రామంలో దాదాపు 19.60ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూమి ఆక్రమణకు గురైంది. నిరుపేద ఎస్సీ, బీసీలకు ఇచ్చిన భూమిని అక్కడి పెత్తందార్లు ఆక్రమించుకున్నారు. సర్వే నంబర్. 194/1, 194/7,195/2, 200/1, 203/3బి, 208/2ఎ, 208/2సీ, 217/2, 222/1లోగల 19.62ఎకరాల భూమిని 33 మంది నిరుపేద ఎస్సీలకు, 19మంది నిరుపేద బీసీలకు డీ పట్టాల కింద ప్రభుత్వమిచ్చింది. లబ్ధిదారులు వెంటనే సాగు చేయకపోవడంతో ఆ భూమిని ఆక్రమించారు.

# విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తాం



రైతుబజారు కూడలిలో ర్యాలీగా వస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- ఎన్నికల ప్రచార ముగింపు సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రానున్న ఎన్నికల్లో గెలిచాక విశాఖలోనే తాము ప్రమాణ స్వీకారం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. శ్రీకాకుళం నగరంలో రైతుబజారు కూడలి నుంచి వైఎస్సార్ కూడలి (ఏడురోడ్లు) వరకు మంత్రి ధర్మాన శనివారం భారీ ర్యాలీ నిర్వహించి ప్రచారాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచారని తెలిపారు. చంద్రబాబు దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోని సీఎం డ్యాష్‌బోర్డు నుంచి తీసేశారని గుర్తు చేశారు. ఒకప్పుడు ఈ సంక్షేమ పథకాలపై చంద్రబాబు విమర్శలు చేశారని, ఇప్పుడు అవే పథకాలను తమ మేనిఫెస్టోలో ఎలా పెట్టారని ప్రశ్నించారు. చంద్రబాబుకి అధికారం ఇస్తే నీరు,చెట్టు, గట్టు, పుట్ట అనే పేర్లతో దోచుకుంటాడే తప్ప ప్రజల్ని పట్టించుకోడని అన్నారు.

**ఎందుకు దుష్ప్రచారం..?**

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నారని సూటిగా అడిగారు. మోదీ కూడా ఈ యాక్ట్ దేశమంతా అమలు చేస్తామని చెప్పారని, అక్కడ నోరుమెదపకుండా ఎందుకు ప్రజలకు తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఈ 40 ఏళ్ల చరిత్రలో ఒక్క శాశ్వతమైన ప్రాజెక్టు రాష్ట్రంలో ఏర్పాటుచేశావా అని అన్నారు. రాష్ట్రం విడిపోయిన సమయంలో కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి 23 సంస్థలు ఇస్తే శ్రీకాకుళం జిల్లాలో ఒక్కటైనా ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయాన్ని ఎంపీ రామ్మోహన్, అచ్చెన్నాయుడు, కూన రవికుమార్‌లు ఒక్క రోజైనా ప్రశ్నించలేదన్నారు. జిల్లాలో మూలపేట పోర్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, ఫిషింగ్‌హార్బర్‌లు ఇలా చెప్పుకుంటే చాలా అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగాయని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, నాలుగు వంతెనలు, 80 అడుగుల రోడ్డు, పార్కుల అభివృద్ధి, మంచినీటి సౌకర్యం తన హయాంలో జరగలేదా అని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టండి పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగపరుచుకోండని కోరారు. ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ప్రచార ముగింపు కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంవీ పద్మావతి, చల్ల అలివేలు, ఎంవీ స్వరూప్, శిమ్మ రాజశేఖర్, కోణార్క్ శ్రీను, సాధు వైకుంఠరావు, డాక్టర్ శ్రీనివాసపట్నాయక్, ఎన్ని ధనుంజయరావు, మండవల్లి రవి, కామేశ్వరి, గుంట జ్యోతి, పైడి మహేశ్వరరావు, ఆలుగుబెల్లి నాగభూషణరావు, సుంకరి కృష్ణలతో పాటు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ధర్మాన అభిమానులు పాల్గొని అడుగడుగున హారతులు, పూలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు.

# ఓటేద్దాం రండి



బైక్ ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా నీ ఓటు, నీ భవిష్యత్ అంటూ ఓటు హక్కు వినియోగంపై 80ఫీట్ రోడ్డు మిల్లు జంక్షన్ వద్ద జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహించిన బైక్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మిల్లు జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ సూర్యమహల్, ఏడు రోడ్ల జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జరిగింది. ర్యాలీలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రెవెన్యూ డివిజనల్ అధికారి సీహెచ్ రంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మే 13న జరగనున్న సాధారణ ఎన్నికల్లో 2019 కన్నా ఎక్కువ శాతం ఓటింగ్ జరగాలన్నారు. ర్యాలీలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, ఎల్‌డీఎం, సూర్య కిరణ్, మెప్మా పీడీ కిరణ్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ ఉజ్వల్, జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాల మాన్ సింగ్, హౌసింగ్ పీడీ గణపతి రావు, జిల్లా పర్యాటక అధికారులు ఎన్.నారాయణ రావు, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాద రావు, ఇంటెక్ సభ్యులు ఎం.శ్రీనివాస రావు, వివిధ శాఖల ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్

శ్రీకాకుళం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని బార్‌లు, దుకాణాలు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో 161 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 18 బార్లు, 2 డిఫెన్సు క్యాంటీన్లు, 2 కల్లు దుకాణాలు, 105 కల్లు సొసైటీలు, రణస్థలంలో ఉన్న బీర్ల ఫ్యాక్టరీలు డ్రైడేలో భాగంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఏపీఎస్‌బీసీఎల్ డిపో కూడా సీలు చేశామన్నారు. ఆదివారం, సోమవారాల్ల ఎలాంటి మద్యం అమ్మకాలు రవాణాలు జరగకుండా, అలాగే ఇతర రాష్ట్రాల నుంచి కూడా రాకుండా తమ సిబ్బంది మొత్తాన్ని వినియోగించినట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమ మద్యం కనిపించినా జిల్లా కంట్రోల్ రూం నంబరు 1950 లేదా 7989343418 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

# పోలీసు యంత్రాంగం సిద్ధం



పోలీస్‌బందోబస్తు గురించి మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల విధులకు ఎస్పీ జీఆర్ రాధిక నేతృత్వంలోని జిల్లా పోలీస్ యంత్రాంగం సర్వం సిద్ధమైంది. సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్ విధుల్లో రెండువేల మందితో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక శనివారం పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ 11 పారా మిలటరీ బృందాలు, రెండు ప్లటూన్లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాక ఏడు అంతర్రాష్ట్ర, నాలుగు అంతర జిల్లాల చెక్‌పోస్టులు, నియోజవర్గానికి మూడు చొప్పున 24 ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు, 286 రూట్లలో సెక్టార్ అధికారులు పనిచేస్తున్నట్లు తెలిపారు.

**520 సమస్యాత్మక కేంద్రాలు..**

జిల్లాలో 2358 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా వాటిలో 298 ప్రాంతాల్లో 520 సమస్యాతక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సెక్టార్ అధికారులు, 707 మంది మైక్రో అబ్జర్వర్లు నిరంతరాయంగా పోలింగ్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షిస్తారని తెలిపారు. హింస జరిగే అవకాశం ఉండే పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయన్నారు.

**రానున్న 48 గంటల్లో..**

మరింత అప్రమత్తంగా ఉంటూ నిరంతరం లాడ్జీలు తనిఖీలు నిర్వహించి కొత్త వ్యక్తులపై ఆరా తీసి అక్రమ రవాణాను అరికట్టడం జరుగుతుందన్నారు. 431 పోలీసు వాహనాలను జీపీఎస్ అనుసంధానంగా సిద్ధం చేశామన్నారు. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలతో పాటు సీఐ, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు స్పెషల్ స్టాటిక్ ఫోర్స్ క్విక్ యాక్షన్ టీమ్‌గా నియమించి పోలింగ్ రోజున ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావివ్వకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు.

**రాజకీయ పార్టీలకు సూచన..**

పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల ప్రవేశ మార్గం నుంచి 200 మీటర్ల పరిధి పైన మాత్రమే తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఆ ప్రదేశంలో ఎక్కువమంది గూమిగూడి ఉండకుండా చూసుకోవాలన్నారు. ఆయా నియోజకవర్గాల్లో బయట నియోజకవర్గాల నుంచి వచ్చిన వ్యక్తులెవరూ ఉండరాదని, లాడ్జీల్లో, ప్రైవేటు గెస్ట్ హౌసుల్లో ఉండేవారు వెళ్లిపోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు.

# వైఎస్సార్ సీపీలోకి వలసలు



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్లట గ్రామస్తులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రెడ్డి ఓంశ్రీకృష్ణ

పాతపట్నం: హిరమండలం మండలంలోని కల్లట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు రెడ్డి ఓం శ్రీకృష్ణ సమక్షంలో శనివారం ఉదయం చేరారు. కల్లట గ్రామానికి చెందిన ఇప్పిలి శ్రీనివాసరావు, కరణం చిన్నంనాయుడు, ఇప్పిలి మురళీధర్, ఇప్పిలి గిరిబాబు, ఇప్పిలి చంద్రబాబు, శాంతిభూషణ్, కిషోర్, బలగ రామకృష్ణలతో పాటు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు లక్ష్మణరావు, పోలాకి చందు తదితరులు పాల్గొన్నారు.

# ఈత సరదాకు చిన్నారి బలి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

హిరమండలం: హిరమండలంలో వంశధార నదిలో మునిగి బాలిక మృతిచెందిన ఘటన మరువక ముందే.. రుగడలో మళ్లీ అలాంటి ఘటనే జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కోమనాపల్లి కాలనీకి చెందిన తెంబూరు వసంతరావు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శనివారం ముగ్గురు పిల్లలతో వసంతరావు, ఉషారాణి దంపతులు రుగడ సమీపంలోని వంశధార నదిలో స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో రెండో కుమార్తె సంజన శ్రేయ (9) ప్రమాదవశాత్తూ గోతిలో పడిపోయింది. తల్లిదండ్రులు గమనించేసరికి ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకుంది. తల్లిదండ్రులు బయటకు తీసి సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. ఈ హఠాత్పరిణామంతో తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. తండ్రి వసంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.

# ప్రచారం సమాప్తం




ప్రచార పర్వం ముగిసింది. అభ్యర్థులు కాళ్లకు చక్రాలు కట్టుకుని ఊరూవాడా తిరిగారు. కనిపించిన వారందరినీ ఓటు వేయాలని అభ్యర్థించారు. మంచి పాలన అందిస్తామని, ఆశీర్వదించాలని కోరారు.



మంత్రి ధర్మాన ప్రసాదరావు భారీ ర్యాలీలతో హోరెత్తించారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.



ఆమదాలవలస రూరల్: తమ్మినేని సీతారాం ఇవే తన చివరి ఎన్నికలని ప్రకటించారు. ఈ సారి ఆశీర్వదించాలని కోరారు. దూసిపేట గ్రామంలో ఉత్సాహంగా ప్రచారం చేశారు.



నరసన్నపేట: ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రజలకు చేరవయ్యారు. కిల్లాంలో ఓ వృద్ధురాలి దీవెనలు అందుకున్నారు.



పాతపట్నం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి అందరికీ చేరువయ్యారు. పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు వద్ద భారీ ర్యాలీ చేశారు.



ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ జోరు కనబరిచారు. పురుషోత్తపురంలో ఉత్సాహంగా ప్రచారం చేశారు.



రణస్థలం: ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఊళ్లన్నీ చుట్టేశారు. జేఆర్ పురం ప్రచారంలో ఇలా మాట్లాడారు.



కాశీబుగ్గ: మంత్రి అప్పలరాజు జనం ప్రేమాభిమానాలు పొందారు. అంబుగాం పంచాయతీలో అక్కచెల్లెమ్మలు ఇలా పూల మాల వేశారు.



సంతబొమ్మాళి: టెక్కలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ జోరుగా ప్రచారం చేశారు. పాతతలగాంలో ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు.